విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 20, మార్చి 2025

బాధితులకు న్యాయం జరిగేలా చూస్తాం

విశాలాంధ్ర - మహానంది: నాగనంది సధనం కూల్చివేతలో జరిగిన ప్రమాద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తామని దేవాదాయశాఖ రీజనల్ జాయింట్ కమీషనర్ చంద్రశేఖర ఆజాద్ తెలిపారు. గత రెండు రోజుల క్రితం ప్రమాద వశాత్తు జరిగిన ప్రమాద ఘటనపై విచారణ కోసం బుదవారం మహానందికి వచ్చారు. ముందుగా శ్రీకామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామివార్లను దర్శించుకున్నారు. అనంతరం నాగనంది వసతి గృహాల వద్ద జరిగిన ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ప్రమాద ఘటన పై ఈఓ శ్రీనివాసరెడ్డి,ఏ ఈఓ మధు, ఏ ఈ శ్రీనివాసులుతో సంఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. కాంట్రాక్టర్ తో పాటు బాధితుల నిర్లక్ష్యం ఉందని తెలిపారు. ఏదైమైన ఆలయ పరిసరాలలో జరగడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబాలకు దేవస్థానం తరపున ఒక్కో కుటుంబానికి లక్ష రూపాయల చొప్పున, కాంట్రాక్టర్ లక్ష రూపాయల చొప్పున చెల్లించేవిదంగా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

నాగనంది వసతి గృహాల కూల్చివేత పనుల వద్ద ప్రమాద వశాత్తు మరణించిన వారి కుటుంబాలకు దేవాదాయశాఖ తరపున ఆర్థికంగా ఆదుకోవాలని శ్రీశైల నియోజక వర్గం, కేసికెనాల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బన్నురు రామలింగారెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు బుధవారం ఆర్జేడీ చంద్రశేఖర ఆజాద్‌ను కోరారు. ఈ సందర్భంగా వారు వినతిపత్రం అందజేశారు. సంఘటన జరగడం బాధాకరమని, ఇందుకు కారణమైన కాంట్రాక్టర్ బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దేవస్థానం తరపున ఆర్థిక సహాయం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వారివెంట మండల టీడీపీ నాయకులు మౌళీశ్వర రెడ్డి, మహానంది దేవస్థానం మాజీ చైర్మన్ నాగ భూపాల్ రెడ్డి, తమడపల్లె జనార్దన్ రెడ్డి, గడ్డం నాగపుల్లయ్య, గంగిశెట్టి మల్లికార్జున, మండల తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విక్కీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

విశాలాంధ్ర- కోవెలకుంట్ల: పట్టణ పరిధిలోని విక్కీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరాన్ని ప్రారంభం చేశారు. విక్కీ ఫౌండేషన్ అధినేత విక్కీ రెడ్డి చేపట్టిన ఈ కార్యక్రమంవిశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 మంది యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయడం జరిగింది. వేసవికాలం కావడం వలన రక్తం కొరతతో పేషెంట్లు రక్తనిధులు ఇబ్బంది పడుతున్న కారణంగా విక్కీ ఫౌండేషన్ అధ్యక్షుడు విక్కి రెడ్డి రక్తదానం ఏర్పాటుచేసి విజయవంతంగా నిర్వహించారు. విక్కీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నంద్యాల బ్లడ్ బ్యాంక్ వారి సహకారంతో నిర్వహించారు.

శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవానికి బీసీ రాజా రెడ్డికి ఆహ్వానం

విశాలాంధ్ర - బనగానపల్లె: మండలంలోని పసుపుల గ్రామంలో ఏప్రిల్ ఏడో తేదీన నిర్వహించనున్న శ్రీ సీతారాముల కళ్యాణం మహోత్సవానికి పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డికి ఆహ్వానించారు. శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకొని పసుపల గ్రామంలో ఏప్రిల్ ఆరో తేదీ నుండి 10వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు బాల నాయుడు, షేక్షావలి, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, బుధవారం బిసి రాజారెడ్డిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. శ్రీ సీతారాముల కళ్యాణం మహోత్సవంలో పాల్గొనాలని కోరారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు

విశాలాంధ్ర - చాగలమర్రి: దుకాణాలు, మెకానిక్ షెడ్లు హోటళ్ళు తదితర వాటిల్లో 18 ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని జిల్లా సహాయ కార్మిక శాఖ అధికారి మురళీకృష్ణ హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని వివిధ దుఖాణాలు, మెకానిక్ షెడ్లను తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సిపిసిఆర్ ఆదేశాల మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. పిల్లలను పనిలో పెట్టుకుంటే యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం బాల కార్మిక నిర్మూలన సంబంధించిన పోస్టర్లను అతికించారు. హెడ్ కానిస్టేబుల్ శంకర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అదనపు ఆర్థిక సాయం గురించి అవగాహన

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్: పట్టణంలోని స్థానిక చక్రం లేఅవుట్ నందు హౌసింగ్ పీడీ హరి గోపాల్, డీఈ నాగార్జున, ఏఈ ఉమామహేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ హరి గోపాల్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీవీటీజీ వర్గాలకు చెందిన గృహ నిర్మాణ లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ పథకం ద్వారా బీసీ, ఎస్సీ, లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, పివిటీజీ లకు ఒక లక్ష రూపాయలు అదనంగా ఇవ్వనున్నారు.

హిందీ పరీక్షకు 21 మంది గైర్హాజరు

విశాలాంధ్ర - రుద్రవరం: పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు బుధవారం జరిగిన హిందీ పరీక్షకు 21 మంది విద్యార్థులు గైర్హాజరు కావడం జరిగిందని మండల విద్యాధికారి వీరరాఘవయ్య తెలిపారు. మండలంలోని నరసాపురం మార్తోమ ఉన్నత పాఠశాలలో 18 మంది విద్యార్థులు, మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు హిందీ పరీక్షకు గైర్హాజరైనట్లు తెలిపారు.

కేసీ ఆయకట్టును పరిశీలించిన భూమా

విశాలాంధ్ర - శిరివెళ్ల: మండల పరిధిలోని కోటపాడు కామినేని పల్లె గోవిందపల్లి వీరారెడ్డిపల్లి శిరివెళ్ల వెంకటాపురం యర్రగుంట్ల జిన పల్లె గుంపుర మాను దీన్నే, వనికం దిన్నే తదితర గ్రామాలకు సంబంధించిన కెసీ కెనాల్ ఆయకట్టు భూములను మరియు కేసీ కెనాల్ ప్రధాన కాలువ నీటి ప్రవాహాన్ని బుధవారం టిడిపి యువ నేత భూమా జగత్ విఖ్యాత రెడ్డి పరిశీలించారు. పలువురు రైతులు రైతు సంఘం నాయకులు నీటి సంఘం నాయకుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కేసీ కెనాల్ ఆయకట్టు ప్రధాన కాలువ గట్టు వెంట ఆయన రైతులతో కలిసి పాదయాత్రగా వెళ్లి పరిశీలించి రైతుల యొక్క సాధక బాధలను అడిగి తెలుసుకున్నారు. నీటి సంఘం అధ్యక్షులు చిలకల రామ్ పుల్లయ్య, కమతం లక్ష్మి రెడ్డి, మాజీ సర్పంచ్ శకుంతలమ్మ ఉన్నారు.

వైద్య సేవలు అంతంతే

సమయానికి హాజరుకాని వైద్యులు, సిబ్బంది

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండలంలోని అంకిరెడ్డిపల్లి గ్రామం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది సమయానికి హాజరు కాకపోవడంతో వైద్య సేవలు అంతంత మాత్రమే అందుతున్నాయి. వైద్య కేంద్రంలో సిబ్బంది కొరత కూడా వేధిస్తున్నది. వైద్యుడితో పాటు ఉన్న మరో ఇద్దరు సిబ్బంది ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ఉదయం 9 నుండి సాయంత్రం 4 గంటలవరకు విధులు నిర్వహించాల్సిన ఉన్న సమయ పాలన పాటించక పోవడంతో వచ్చే రోగుల్లో కూడా అయోమయం నెలకొంది. ఏడాదిన్నర కిందట గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసినప్పటికీ ప్రభుత్వం కూడా పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించలేదు. దీంతో వచ్చే రోగులకు ఆశా వర్కర్లే వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ఆశ వర్కర్ల వద్ద ఆరోగ్య కేంద్రం తాళాలు ఉండడంతో వారు వచ్చినప్పుడే సిబ్బంది ఆరోగ్య కేంద్రంలోకి వెళ్తున్నారు. బుధవారం ఉదయం 9 గంటల దాటినప్పటికీ ఆరోగ్య కేంద్రం తాళాలు తీయలేదు. ఆరోగ్య కేంద్రంలో విధులు నిరుస్తున్న ఎంపీహెచ్వో మాత్రం బయటనే వేచి ఉన్నారు. అయితే వైద్యుడు మాత్రం అప్పటివరకు రాలేదు.

గ్రామం బయట నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాల ఏర్పాటుకు భూమి పూజ జరిగిన నేటి వరకు ముందడుగు పడలేదు దీంతో పాతబడ్డ ఓ ఇంటిలో అద్దెకు తీసుకొని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించడంతో పాటు వైద్యులు సిబ్బంది సమయ పాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రాణం తీసిన సెల్ఫీ

సంగమేశ్వరుడిని చూడబోయి మృత్యుఒడికి
కృష్ణానదిలో పడి యువకుడు మృతి

విశాలాంధ్ర - కొత్తపల్లి : సరదా కోసం తీసిన సెల్ఫీ ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. కృష్ణమ్మను వీడుతున్న సంగమేశ్వరుడిని చూడబోయిన ఓ యువకుడు మృత్యుఒడికి చేరగా ఒకరు బతికి బయట పట్టాడు. ఈ ఘటన మండలంలోని సప్తనదుల సంగమేశ్వరం వద్ద బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. జూపాడుబంగ్లా మండలం మంఢ్లెం గ్రామానికి చెందిన మద్దిలేటి కుమారుడు సందీప్ (23) డిగ్రీ డిస్ కంటిన్యూ చేశాడు. ప్రస్తుతం వేసవి కావడంతో శ్రీశైలం జలాశయం నీటి మట్టం క్రమంగా తగ్గుముఖం పడుతోంది. ఈ క్రమంలో ఏపీ-తెలంగాణ సరిహద్దు ప్రాంతంలో సప్తనదులు కలిసే సంగమ క్షేత్రమైన సంగమేశ్వరం ఆలయం క్రమంగా జలాదివాసం వీడుతోంది. ఈ అపురూప ఘట్టాన్ని తిలకించేందుకు ఏపీ, తెలంగాణతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు, పర్యాటకులు వస్తుంటారు. మంఢ్లెం గ్రామా నికి చెందిన మృతుడు తన స్నేహితుడితో కలిసి వచ్చాడు. నదిలో ఉండే దేవాలయం పడేలా మొదట సెల్ఫీ తీసుకు న్నారు. రెండ్రోజులుగా ఆలయ పురోహితులు నీటిలో నడ వడం, నీటిలోనే గుడిలోకి వెళ్లడం వంటి ఫొటోలు చూసిన యువకులు వారు కూడా నీటిలో నడుచుకుంటూ ఆలయం లోకి వెళ్లే ప్రయత్నం చేశారు. ఆలయానికి సమీపంలో లోతు ఎక్కువగా ఉందని, అక్కడికి వెళ్లవద్దని స్థానికులు వారించినా వినలేదు. నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో మునిగిపోయాడు. వెంట ఉన్న మరో యువకుడు కేకలు వేయడంతో స్థానికులు పుట్టీల ద్వారా వచ్చి గాలించి నదిలో గల్లంతైన యువకుడిని బయటకు తీశారు. ఆ యువకుడు అప్పటికే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు కొత్తపల్లి తహసీల్దార్ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

దేవస్థాన భూములను కాపాడండి : సీపీఐ

విశాలాంధ్ర - నంద్యాల అర్బన్: బేతంచెర్ల పట్టణ, మండలంలోని గ్రామాల్లోని దేవస్థానం భూములను అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు డిమాండ్ చేశారు. దేవస్థానం భూములను కాపాడాలని కోరుతూ సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగ నాయుడు, సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, బేతంచెర్ల మండల కార్యదర్శి వై.భార్గవ్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.సోమన్న, సీనియర్ నాయకులు సంజీవులు, ఏఐటీయుసి పట్టణ కార్యదర్శి డి.శ్రీనివాసులుతో కలిసి జిల్లా దేవాదాయ శాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్.రంగనాయుడు మాట్లాడుతూ జిల్లా బేతంచెర్ల పట్టణం మరియు మండలంలోని

గ్రామాలలో వున్నా ఆంజనేయస్వామి, చెన్నకేశవ స్వామి, మాధవ స్వామి, గట్టు నరసింహస్వామి ఆలయాలకు చెందిన సుమారు 200 ఎకరాల భూములు ఉన్నాయన్నారు. గత ప్రభుత్వంలో ఉన్న నాయకులు ప్రస్తుత ప్రభుత్వంలో ఉన్న నాయకులు తమకు వున్న పలుకుబడిని ఉపయోగించి దేవస్థాన భూములను కబ్జా చేసి దేవస్థానాలకు వచ్చే ఆదాయమును సైతం గండీకొట్టి అనుభవిస్తున్నారని ఆరోపించారు. ఇల్లు లేని నిరుపేదలు రెండు సెంట్ల ఇంటి స్థలం ఆక్రమించి ఇల్లు నిర్మించుకుంటే వాటిని స్వాధీనం చేసుకునే అధికారులు ఇంత పెద్ద స్థాయిలో దేవస్థానం భూములు ఆక్రమణకు గురవుతుంటే అధికారులు మాత్రం నిమ్మకు నిరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమణకు గురైన భూములు ప్రస్తుత బహిరంగ మార్కెట్లో సుమారు 200 కోట్ల రూపాయలు విలువ ఉంటుందని అన్నారు. దేవుని మాన్యం భూములను అక్రమణదారుల నుండి కాపాడాలన్నారు.

ప్రమాదాలు తలెత్తకుండా ప్రమాణాలు పాటించండి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : పరిశ్రమల్లో ఆకస్మిక ప్రమాదాలు సంభవించినప్పుడు పర్యావరణ పరిరక్షణ చట్టం 1986 ప్రకారం భద్రతా ప్రమాణా లను ఖచ్చితంగా పాటించాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ పరిశ్రమల యాజమాన్యాలను సూచించారు. బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిక్ట్ క్రైసిస్ గ్రూప్ సమావేశాన్ని జాయింట్ కలెక్టర్ నిర్వహించారు. సమావేశంలో నంద్యాల ఆర్డీఓ విశ్వనాథ్, పరిశ్రమల శాఖ డిప్యూటీ ఇన్స్పెక్టర్ నారాయణ రెడ్డి, జిల్లా విపత్తు నిర్వహణ, అగ్నిమాపక శాఖ అధికారి జి.బాలరాజు, ఎస్డిఆర్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ సుధాకర్ రెడ్డి, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు. జేసీ మాట్లాడుతూ పరిశ్రమల్లో అనుకోని ప్రమాదాలు సంభవించినప్పుడు వాటిని ఎదుర్కొనేందుకు భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని పరిశ్రమల యాజమాన్యాలను సూచించారు. పరిశ్రమల్లో మాక్ డ్రిల్స్ నిర్వహించే సమయంలో సంబంధిత అధికారులను అందరూ పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని పరిశ్రమల శాఖ జీఎంను ఆదేశించారు. పరిశ్రమల్లో ఏవైనా చిన్న లోపాల వల్ల ఆన్‌సైట్‌లో ఏర్పడిన ప్రమాదాన్ని అక్కడే నివారించి, ఆఫ్ సైట్‌లోకి ప్రమాదం వ్యాపించకుండా తప్పనిసరి చర్యలు తీసుకోవాలన్నారు.

ఇంకుడు, ఎరువుగుంతలు ఏర్పాటు చేయండి

విశాలాంధ్ర - చాగలమర్రి: గ్రామాల్లో ఎరువుల గుంతలు, పారంపాండ్లు, ఇంకుడు గుంతలను గుర్తించి వాటిని ఏర్పాటు చేయాలని ఉపాధి ఏపీడి సాంబశివరావు తెలిపారు. చాగలమర్రి పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇంకుడు గుంతలను గుర్తించి వాటిని మంజూరు చేసి వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. అలాగే గ్రామాల్లో ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలన్నారు. గ్రామాల్లో అవసరమైన పనులను గుర్తించి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఎంపీడీవో రాజేంద్రప్రసాదు, ఏపీవో నిర్మల, సిబ్బంది పాల్గొన్నారు.

అటవీ సంరక్షణకు గేటు ఏర్పాటు

విశాలాంధ్ర - రుద్రవరం: మండలంలోని పెద్దకంబలూరు గ్రామ సమీపం లోని నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న తెలుగు గంగ ప్రధాన కాలువ వంతెనపై అటవీ సంరక్షణలో భాగంగా గేటు ఏర్పాటు చేసినట్లు సెక్షన్ ఆఫీసర్ కిషోర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ చలమ రేంజ్ పరిధిలో ఉన్న పెద్దకంబలూరు సెక్షన్ నల్లమల అటవీ ప్రాంతంలో నేరాలు జరగకుండా ఉండేందుకు వంతెనపై గేటు ఏర్పాటు చేయడం వల్ల ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అడవుల్లోకి పశువులను మేత కోసము తీసుకొని వెళ్లి వదిలేస్తున్నారన్నారు. పశువులు చెట్లను కొమ్ములతో వృద్ధి విరిగిపోయేటట్లు చేస్తున్నాయన్నారు. కొందరు వ్యక్తులు అక్రమంగా అడవుల్లో ప్రవేశించి వంట చెరుకు వెదురు రవాణా చేస్తున్నారన్నారు. అడవులను సంరక్షించేందుకు గేటు ఏర్పాటు చేశామన్నారు. ఎవరు అధికారుల అనుమతి లేకుండా అడవుల్లోకి ప్రవేశించరాదన్నారు. గేటు ఏర్పాటు లో బీట్ ఆఫీసర్ రామారావు సిబ్బంది ఉన్నారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు

విశాలాంధ్ర - చాగలమర్రి: వేసవి కాలం తరుణంలో గ్రామాలలో త్రాగు నీటి సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి జమీవుల్లా తెలిపారు. బుధవారం చాగలమర్రి పట్టణంలోని మూడవ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి4 సర్వే, మ్యాన్ మిస్సింగ్ సర్వే, వర్క్ ఫ్రమ్ హోమ్, ప్రజాసమస్యల పరిష్కార వేదికలపై ప్రజాభిప్రాయ సేకరణలపై సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకొని పలు సూచనలను సలహాలను ఆయన అందజేసారు. గ్రామ పంచాయతి కార్యాలయాన్ని తనిఖీ చేసి వివిధ రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ గ్రామాలలో గ్రామాలలో ఆర్‌డబ్ల్యాఎస్ శాఖ సమన్వయంతో చర్యలు చేపట్టామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను రూ.10.43 కోట్లు పన్నులు వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.6.43 కోట్లు వసూలయ్యయన్నారు.ఈ నెల చివరి నాటికి వంద శాతం పన్నులు వసూలు చేస్తామన్నారు. జిల్లాకు రూ.28 కోట్లు 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరయ్యాయని వీటిని పారిశుద్యం, తాగునీటి కోసం వెచ్చిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా 15 మేజర్ గ్రామపంచాయతీలు, 489 గ్రామ పంచాయతీలు ఉన్నాయని గ్రామా పంచాయతీ కార్యాలయాలలో గల ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్‌పిడి, ఇన్‌చార్జ్ ఈఓ తహేర్‌హుసేన్, పంచాయతీ కార్యాలయ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కేసీ కెనాల్ 16వ లాక్ చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ: కేసీ కెనాల్ 16వ లాకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని ఆళ్లగడ్డ తాలూకా టిడిపి యువ నాయకులు భూమా జగద్విఖ్యాత్ రెడ్డి అధికారులను కోరారు. బుధవారం ఆయన రైతులతో కలిసి దొర్నిపాడు కేసీ కెనాల్ నుండి 16 వ లాక్ వరకు పర్యటించారు. 16 వ లాకు నుండి అయ్యలూరి మెట్ట వద్ద ఉన్న కేసీ కెనాల్ ను పరిశీలించి అనంతరం వెలుగోడు రిజర్వాయర్కు వెళ్లి అక్కడ నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ కేసి కెనాల్‌లో నీరు తక్కువగా ఉన్నందువల్ల తెలుగు గంగనుండి నీరు ఇవ్వాలని ఆయన అధికారులను కోరారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అధికారులతో మాట్లాడి మచ్చుమర్రి నుండి కేసి కెనాల్ కు నీరు ఏ విధంగా అందించారో, సంత జూటూరు తెలుగుగంగ కాలువ నుండి 16 వ లాకు వరకు కేసీ కెనాల్ కు నీరు ఇవ్వాలని అధికారులను కోరడం జరిగింది. రైతులకు రాజకీయాలతో సంబంధం లేదని రైతుల కోసం మేము ఎలాంటి త్యాగానికైనా సిద్ధమని కేసీ కెనాల్ 27వ లాకు వరకు నీరు అందించేలా చూస్తామని రైతులకు భూమా జగద్విఖ్యాత్ రెడ్డి హామీ ఇచ్చారు. రైతు సంఘం నాయకులు సిద్ధం రెడ్డి జాఫర్ రెడ్డి, కెసికెనాల్ డిస్ట్రిబ్యూటరీ 7, 8 కమిటీ చైర్మన్లు బబ్బూరి వెంకటస్వామి, ఏరువ ప్రసాద్ రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

న్యాయం కోసం తహశీల్దార్‌ను ఆశ్రయించిన రైతులు

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల పరిధిలోని గుండంపాడు గ్రామానికి చెందిన ఆర్ సుబ్రహ్మణ్యం, వారి కుటుంబ సభ్యులు రైతులు న్యాయం కోసం బుధవారం శిరివెళ్ల తహశీల్దార్ పుష్పకుమారిని కలిసి అర్జీ అందజేశారు. రిజిస్టర్ దస్తావేజులు కలిగి న్యాయస్థానం ఆదేశాలు ఉన్నప్పటికీ ఆన్లైన్‌లో తమ పేరు నమోదు చేయలేదని అన్నారు. తనకు రిజిస్టర్ అయిన పొలాన్ని అదే సర్వే నెంబర్ను మరొక వ్యక్తికి రిజిస్టర్ చేయించడం వల్ల జిల్లా సబ్ రిజిస్టర్ ఆదేశాల మేరకు క్రయవిక్రయాలు జరిపిన వారిపై రిజిస్టర్ చేసిన సబ్ రిజిస్ట్రార్‌పై శిరివెళ్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయినదని న్యాయస్థానం ఆదేశాలు తమకు అనుకూలంగా ఉన్నప్పటికీ గ్రామ వార్డు సచివాలయ సర్వేయర్ చేసిన సర్వే రిపోర్టు తమను ఇబ్బందులకు గురి చేస్తున్నదని తహశీల్దార్‌కు అర్జీ ద్వారా అందజేశారు. జిల్లా కలెక్టర్‌కి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో న్యాయం కోసం అర్జీ ఇవ్వగా తాసిల్దార్ విచారణ నిమిత్తం శిరివెళ్ల రెవెన్యూ కార్యాలయాన్ని పిలిపించి, జరిగిన సమాచారాన్ని లిఖితపూర్వకంగా రాసి ఇవ్వాలని కోరినట్లు తెలిపారు.

ఆర్ సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు విఆర్ఓ ఆధ్వర్యంలో తమ వ్యవసాయ భూమిపై స్టేట్మెంట్ అందజేసినట్లు తెలిపారు. ఆన్లైన్లో తమ భూములను ఎక్కించి తమకు న్యాయం చేయాలని కోరారు.

విద్యుత్తు పనులు చేస్తుండగా విద్యుత్ సరఫరా

విశాలాంధ్ర - రుద్రవరం: విద్యుత్తు పనులు చేస్తుండగా విద్యుత్ సరఫరా అవ్వడంతో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని కోటకొండ గ్రామ సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు.. గ్రామ సమీపంలో ఉన్న పంట పొలాల్లో విద్యుత్ స్తంభాలపై మాధవ, రాజు అనేవారు విద్యుత్ పనులు చేసేందుకు స్థానిక లైన్‌మెన్ మల్లయ్య ఎల్లా వత్తుల విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి ఎల్సీ తీసుకున్నారు. ఎల్సీ రిటర్న్ చేయకముందే సరఫరా కావడంతో పనులు చేస్తున్న ఇద్దరు వ్యక్తులు విద్యుత్ షాక్‌కు గురై కింద పడ్డారు. ఈ ప్రమాదంలో మాధవకు తీవ్ర గాయాలు కాగా, రాజు స్వల్ప గాయాలతో బయటపడ్డారన్నారు.

ఏజీపీకి ఘన సన్మానం

విశాలాంధ్ర - చాగలమర్రి : ఆళ్లగడ్డ సీనియర్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులకు అసిస్టెంట్ గవర్నమెర్ ప్లీడర్‌గా నియమితులైన శిరువెళ్ళ మండలంలోని యర్రగుంట్ల గ్రామానికి చెందిన న్యాయవాది కమతం బాలగుర్రెడ్డిని తెదేపా నాయకులు ఘనంగా సన్మానించారు. చాగలమర్రికి చెందిన టీడీపీ నంద్యాల పార్లమెంట్ బిసి సెల్ స్పోక్ పర్సన్ సల్లానాగరాజు ఆధ్వర్యంలో ఏజీపీ స్వగ్రామానికి వెళ్లి ఏజీపీని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా న్యాయవాద వృత్తిలో ఎన్నో సేవలందించారన్నారు. కార్యక్రమంలో టీఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి గుత్తినరసింహులు, నాయకులు బషీర్, కసినేని ఓబులేసు, నారాయణ పాల్గొన్నారు.

పదవ తరగతి పరీక్షల తనిఖీ

విశాలాంధ్ర - వెలుగోడు : మండల కేంద్రంలోని వెలుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, డిపౌల్ పదో తరగతి పరీక్షా కేంద్రాలను బుధవారం డిప్యూటీ డిఇఓ శంకర్ ప్రసాద్, స్క్వాడ్ సిబ్బంది తనిఖీ చేశారు. విద్యార్థులు ఈరోజు హిందీ పరీక్షలు రాస్తున్నారు. వారు మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని తెలిపారు. విద్యార్థులు ఎలాంటి భయాందోళనలు చెందకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి బ్రహ్మం నాయక్ పాల్గొన్నారు.

నాటుసారాకు దూరంగా ఉండండి

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : నాటు సారాకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని బనగానపల్లి ఎక్సైజ్ శాఖ సిఐ వర్ధనాదేవి అన్నారు. బుధవారం మండలంలోని బెలుం గ్రామంలో జిల్లా ఎక్సైజ్ అధికారి రవికుమార్ ఆదేశాలతో నవోదయ 2.0 కార్యక్రమంలో భాగంగా ఎక్సైజ్ ఎస్ఐ కమలాకర్‌తో కలిసి గ్రామస్తులకు ఆమె అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నాటు సారాకు అలవాటు పడి బానిసలై ఆరోగ్యాన్ని పాడు చేసుకోవద్దన్నారు. నాటు సారా తయారుచేసిన తరలించిన విక్రయించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నాటు సారా త్రాగడం వల్ల ఏర్పడే ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయన్నారు. గ్రామాలలో సారా అమ్మకాలు జరుగుతుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. తాగుడు వల్ల గ్రామాలలో ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడతాయని, కాబట్టి సారాకు దూరంగా ఉండి ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని కోరారు. గ్రామంలో సారా అమ్ముతున్న ఐదుగురిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్టు ఎక్సేంజ్ ఎస్ఐ కమలాకర్ తెలిపారు.

మాతృ శాఖలో విలీనం చేయాలి

విశాలాంధ్ర-అవుకు: రైతు సేవా కేంద్రాలలో పనిచేస్తున్న వ్యవసాయ సహాయకులను మాతృ శాఖ అయిన వ్యవసాయ శాఖలో విలీనం చేయాలని నంద్యాల జిల్లా వ్యవసాయ సహాయకుల సంఘం అధ్యక్షుడు టి.కుమార నరసింహులు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెండు, లేదా మూడు సచివాలయాలకు ఒక వ్యవసాయ సహాయకున్ని నియమించడం వలన పని భారం ఎక్కువ అవుతుందని అన్నారు. వ్యవసాయ సహాయకులు పనిభారం వలన తీవ్రమైన ఒత్తిడికి గురై మానసిక ఆందోళనకు గురవుతున్నామని అన్నారు. కావున జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వ్యవసాయ సహాయకులపై సర్వే ఒత్తిడి ఇతర శాఖల పనుల నుంచి విముక్తి కలిగించాలని అన్నారు. వ్యవసాయ సహాయకులను మాతృ శాఖ అయిన వ్యవసాయ శాఖలో విలీనం చేయడం వలన రైతులకు మరింత సేవ చేసే అవకాశం కలుగుతుందని అన్నారు.

భూమాను కలిసిన నూతన ఏజీపీ

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ సీనియర్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టులకు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమితుడైన కమతం బాల గుర్రెడ్డి బుధవారం తాలూకా టిడిపి యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక స్వగృహంలో కమతం బాల గుర్రెడ్డి భూమాను కలిసి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం భూమా జగత్ రెడ్డి ఏజీపిగా నియమితుడైన కమతం బాల గుర్రెడ్డికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిపి బత్తిని శివప్రసాదరావు, ప్రముఖ న్యాయవాది శివరామిరెడ్డి, సిరిమల్లె రమణయ్య తదితరులు ఉన్నారు.

ఫోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్ : యువత చెడు మార్గాలవైపు వెళ్లకుండా మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలని ప్రముఖ న్యాయవాది జి.సుదర్శన్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో న్యాయవిజ్ఞాన సదస్సులో విద్యార్థులకు పోక్స్ చట్టం గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2012 సంవత్సరం నుండి పోక్స్ చట్టం అమలులోకి వచ్చిందని ఇందులో 46 సెక్షన్లు పొందుపరిచారని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ పద్మావతి బాయి, అధ్యాపకులు విద్యా సాగర్, కృష్ణ, విద్యా ర్థులు పాల్గొన్నారు.

మహిళల కష్టాలు మీకు తెలియదా..?

రెండేళ్లుగా పనిచేయని ఆర్టీసీ మరుగుదొడ్లు.

విశాలాంధ్ర - వెలుగోడు : మహిళలు సగ భాగం అంటారు, మహిళలకు 50 శాతం రిజర్వేషన్స్ అమలు చేస్తామంటున్నారు, మహిళలు అన్ని రంగాల్లో రాణించాలంటున్నారు. కానీ మహిళలు పడుతున్న సమస్యలు, కష్టాలు నాయకులకు, అధికారులకు కనపడవు. ఈ దేశానికీ ప్రథమ పౌరురాలు మహిళ, ఏపీకి హోంశాఖ మంత్రి మహిళా, జిల్లా కలెక్టర్ ఓ మహిళా, వెలుగోడు జెడ్పీటీసీ సైతం ఓ మహిళనే. వెలుగోడు ఆర్టీసీ బస్టాండ్‌లో గత రెండేళ్లుగా మరుగుదొడ్లు మూత పడటం వల్ల మహిళలు అష్టకష్టాలు పడుతున్నారు. వెలుగోడు ఆర్టీసీ బస్టాండ్ ముప్పై ఏళ్ల క్రితం ఏర్పాటు అయింది. ఒక రేకుల షెడ్డు ప్రయాణికులకు ఏర్పాటు చేశారు. లోక్ సత్తా అభ్యర్థన పై మహిళలకు మరుగుదొడ్లు బస్టాండ్‌లో ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ వర్కర్‌ను మరుగుదొడ్ల నిర్వహణ కొరకు ఏర్పాటు చేశారు. కొన్ని సంవత్సరాలు మరుగుదొడ్లు మహిళలకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. మరుగు దొడ్ల కోసం ఏర్పాటు చేసిన గుంత నిండటం వల్ల, దాన్ని శుభ్రం చేయడంలో అశ్రద్ధ వల్ల కంపు భరించలేక ఎదురుగా నివాసం ఉంటున్న సిఐటియూ నాయకులు రఫీ పిర్యాదు వల్ల గ్రామ పంచాయతీ ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంతో మరుగుదొడ్లు మూతబడ్డాయి. వెలుగోడు ఆర్టీసీ బస్టాండ్ నుంచి రోజుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి సుమారు 200 నుంచి 400 వరకు మహిళలు బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు. వీరికి బస్టాండ్ లో మరుగుదొడ్లు లేక రెండేళ్లుగా మహిళలకు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. కానీ అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా ఆర్టీసీ బస్టాండ్‌లోని మరుగు దొడ్ల విషయంలో తగిన చర్యలు తీసుకుని ప్రారంభించాలని పలు సంఘాల నాయకులు కోరుతున్నారు.

మాబాష కుటుంబానికి న్యాయం చేసిన ఫిరోజ్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : పట్టణంలో ఈ నెల 9వ తేదీన ఛాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టు విజయం సాధించడంతో క్రికెట్ సంబరాల్లో చోటుచేసుకున్న దుర్ఘటనలో తోపుడు బండ్ల వ్యాపారి మాబాషా కంటిచూపును కోల్పోయారు. ఈ విషాదకర సంఘటన తెలుసుకున్న వెంటనే ఫిరోజ్ ఆసుపత్రికి చేరుకుని, నేరుగా వైద్యులతో మాట్లాడి మాబాషా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి, అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఫిరోజ్ ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా ఇరు పక్షాలతో మాట్లాడి రాజీ కుదిర్చి, మాబాష కుటుంబానికి ఆర్థిక సహాయం అందేలా కృషి చేశారు. ప్రభుత్వం తరపున అన్ని సహాయ సహకారాలు అందించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కనీసం వారి కుటుంబానికి తోడుగా ఉండేలా ఆర్థిక సహాయం అందేలా కృషి చేయడం జరిగిందన్నారు. కంటి వైద్యుల సూచనలు మబాషాకు కంటిని అమర్చేలా కృషి చేస్తామన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

ఈ నెల 22న డిప్యూటీ సీఎం జిల్లాకు రాక

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ఈ నెల 22వ తేదీన డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ జిల్లాకు రానున్నారని, ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లాలలో డిప్యూటీ సీఎం పర్యటన సందర్భంగా ఏర్పాట్లపై కలెక్టర్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా రాబోయే జూన్ లోపు రెండు లక్షల ఫార్మ్ పాండ్స్‌లను పూర్తి చేయాలన్న లక్ష్యంతో నిర్మిస్తున్న సందర్భంగా జిల్లాలో డిప్యూటీ సీఎం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారని తెలిపారు. ఇందులో భాగంగా కర్నూలు జిల్లాలో 8500 ఫార్మ్ పాండ్స్ నిర్మించడం జరుగుతోందని, ఓర్వకల్లు మండలం పూడిచర్ల గ్రామ పరిధిలో ఫార్మ్ పాండ్‌కు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భూమిపూజ చేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. తొలుత ఓర్వకల్లు ఎయిర్పోర్ట్ కు చేరుకొని అనంతరం, పూడి చెర్లలో ఫార్మ్ పాండ్‌కు భూమి పూజ చేస్తారని, తదుపరి బహిరంగ సభలో డిప్యూటీ సీఎం పాల్గొంటారని, అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి ఓవరాల్ ఇన్చార్జ్‌గా కర్నూలు ఆర్డీవో ఉంటారని కలెక్టర్ తెలిపారు. బందోబస్తు, స్టేజ్ అరేంజ్మెంట్స్, బ్యారికేడింగ్, బహిరంగ సభ ప్రాంతంలో పారిశుధ్య ఏర్పాట్లు, సౌండ్ సిస్టమ్,శిలా ఫలకం, బ్యాక్ డ్రాప్, తాగునీటి సరఫరా తదితర ఏర్పాట్లన్నీ గురువారం సాయంత్రానికి ఒక కొలిక్కి రావాలని, శుక్రవారం సాయంత్రం లోపు అన్ని ఏర్పాట్లు పూర్తి కావాలని కలెక్టర్ కర్నూలు ఆర్డీఓ, జడ్పీ సీఈవో, పీడీ డ్వామా, ఎస్ఈఆర్ అండ్ బీ, పీడీ డీఆర్డీఏ, పీడీ మెప్మా, డీఎస్పీ, జెడ్పీ సీఈవో, ఎస్ఈ ఆర్డబ్ల్యుఎస్, ఓర్వకల్లు తహశీల్దార్, ఎంపీడీవోలను ఆదేశించారు. ఈ అధికారులు బుధవారం సాయంత్రం పూడిచెర్ల గ్రామానికి వెళ్ళి ఏర్పాట్లను పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. టెలికాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, డీఆర్వో వెంకటనారాయణమ్మ, కర్నూలు ఆర్డీవో సందీప్, జడ్పీ సీఈవో నాసర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ శాంతపై అవిశ్వాస తీర్మాణం

విశాలాంధ్ర - ఆదోని : ఆదోని మున్సిపల్ చైర్ పర్సన్ శాంతాపై వైసీపీ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానాన్ని జిల్లా కలెక్టర్ రంజిత్ భాషకు సమర్పించారు. బుధవారం ఆదోని మున్సిపల్ చైర్ పర్సన్‌ను మార్చాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ రంజిత్ బాషాకు అవి శ్వాస తీర్మానాన్ని సమర్పిం చారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు సందీప్ రెడ్డి, ఫయాజ్ అహ్మద్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం తరఫున మున్సిపల్ చైర్పర్సన్‌గా బాధ్యతలు చేపట్టి పార్టీ ప్రతిపక్షంలోకి వెళ్లగానే చైర్ పర్సన్ భర్త సింహం నాగేంద్ర బీజేపీలో చేరి, చైర్ పర్సన్ శాంత కౌన్సిల్ సమావేశంలో వైపీపీకి వ్యతిరేకంగా పనిచేస్తున్నారని అన్నారు. వైసీపీలోనే ఉంటూ వైసీపీ కౌన్సిలర్లను అడ్డుకుంటూ వార్డుల్లో అభివృద్ధికి అడ్డుకొని, పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు చేస్తున్న చైర్పర్సన్‌పై 34 మంది కౌన్సిలర్ల సంతకాలతో కూడిన అవిశ్వాస తీర్మానాన్ని జిల్లా కలెక్టర్‌కు సమర్పించడం జరిగింద న్నారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ అవిశ్వాసానికి సంబంధించిన ఫైళ్లను, ప్రొఫా ర్మాను తయారుచేసి సమాచారం తెలియ జేస్తానన్నారు. పట్టణ ప్రజలు రాజకీయ విశ్లేషకులు ఊహించిన విధంగానే వైసీపీ మున్సిపల్ చైర్పర్సన్‌ను ఆ పార్టీ కౌన్సిలర్లే చైర్పర్సన్‌ను మార్చాలంటూ అవిశ్వాసం పెట్టడం జరిగింది. 42 మంది కౌన్సిలర్లలో 34 మంది కౌన్సిలర్ల బలం వైసీపీకి ఉండడంతో మరోసారి ఆదోని మున్సిపల్ చైర్పర్సన్ పదవిని వైసీపీ దక్కించుకోనుంది.

ఈతకు వెళ్లి బాలుడు మృతి

విశాలాంధ్ర - కర్నూలు: చిప్పగిరి మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం దగ్గర పెద్దబావిలో ఈతకు వెళ్లి సుభాష్ (13) బాలుడు బుధవారం మృతి చెందారు. చిప్పగిరి గ్రామానికి చెందిన సతీష్‌కు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఇందులో పెద్ద కుమారుడు సుభాష్ మంగళవారం సాయంత్రం గ్రామంలోని పెద్దబావికి ఈతకు వెళ్లి, బావి దగ్గరే ద్విచక్ర వాహనం, బట్టలు గుర్తించిన స్థానిక ప్రజలు తల్లి దండ్రులకు సమాచారం ఇచ్చారు. మంగళవారం రాత్రంతా వెతకగా ఆచూకీ తెలియరాలేదని, ఈ విషయంపై స్థానిక పోలీసులకు బాలుని తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. బుధవారం ఆలూరు సీఐ రవిశంకర్ రెడ్డి, చిప్పగిరి ఎస్ఐ సతీష్ కుమార్‌ల ఆధ్వర్యంలో గజ ఈతగాళ్ల చేత పెద్ద బావిలో గాలించగా ఎక్కువ నీళ్లు ఉండడంతో ఆచూకీ తెలియ లేదు. దీంతో గుంతకల్ అగ్నిమాపక సిబ్బంది ద్వారా గాలింపు చర్యలు చేపట్టడంతో బుధవారం మధ్యాహ్నానికి బాలుని మృతదేహాన్ని వెలికి తీయడం జరిగిందని ఎస్సై సతీష్ కుమార్ తెలిపారు. పోలీసులు భాస్కర్, శంకరయ్య, షబ్బీర్ బాష, ఖాదర్ బాషతో పాటు ఏడిఎఫ్ఓ అశ్వర్థ, అగ్నిమాపక సిబ్బంది చిన్న వెంకట రాముడు, డ్రైవర్ ప్రతాప్ నాయక్, లోకేశ్వర రెడ్డి, గద్దల రమేష్, పెద్దిరెడ్డి, హెూంగార్డ్స్ సుకూరు, రాంప్రసాద్, పాల్గొన్నారు. బాలుని మృతదేహాన్ని గుంతకల్ ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

విశాలాంధ్ర-పత్తికొండ: వేసవి కాలం దృష్ట్యా గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆర్డీఓ భరత్ నాయక్ సూచించారు. బుధవారం ఆర్డీవో కార్యాలయంలో డివిజన్‌లోని ఆర్డబ్ల్యూఎస్ డీఈలు, ఏఈలు, ఈవో పిఆర్డిఎస్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ డివిజన్‌లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న గ్రామాలను గుర్తించి తమ దృష్టికి తీసుకువస్తే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో సుగంధిని ప్రతిభ

విశాలాంధ్ర -కర్నూలు: ఈ నెల 16వ తేదీ గుంటూరు జిల్లా తెనాలిలోని ఎన్‌టీఆర్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి అస్మిత ఖేలో ఇండియా ఉమెన్స్ సిటీ లీగ్ తైక్వాండో పోటీల్లో కర్నూలు నగరానికి చెందిన క్రీడాకారిణి సుగంధిని జూనియర్ అండర్-49 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించినట్లు తైక్వాండో కోచ్ జి.షబ్బీర్ హుస్సేన్ బుధవారం తెలిపారు. తమ క్రీడాకారిణి జూన్ నెలలో జరగబోయే సౌత్ జోన్ తైక్వాండో పోటీలకు అర్హత సాధించినట్లు చెప్పారు. ఈ నెల 16న జరిగిన పోటీలకు ముఖ్య అతిథిగా తెనాలి అసిస్టెంట్ కమిషనర్ వల్లూరి లక్ష్మీపతి రావు, రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సలాంలు పాల్గొని క్రీడాకారిణికి బంగారు పతకాన్ని ప్రదానం చేశారని తెలిపారు.

నగర ర్యాంకు మెరుగుదలకు సహకరించండి

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : నగరంలో రోజువారీ స్వచ్చత పనులపై నగర ప్రజలు తమ అభిప్రాయం తెలపాలని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బుధవారం ఒక ప్రకటనలో కోరారు. కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఏటా నగరాల్లో, పట్టణాల్లో పారిశుద్ధ్య స్థితిగతులపై మదింపు జరిపి ర్యాంకులు ప్రకటిస్తున్న విషయం అందరికీ తెలిసిందేనని, కర్నూలు నగరం ఆరంభంలో 221వ ర్యాంకులో ఉండగా, ప్రజలందరి భాగస్వామ్యంతో పురోగతి సాధించుకుంటూ, గత సంవత్సరానికి 32వ ర్యాంకుకు చేరుకున్నదని పేర్కొన్నారు. అయితే ఈ ఏడాది సింగిల్ డిజిట్ ర్యాంకు సాధించాలనే సంకల్పానికి నగరంలోని ప్రతి పౌరుడి సహకారం అవసరం అన్నారు. ఇందు కోసం స్వచ్ఛ సర్వేక్షన్ వెబ్‌సైట్ https://sbmurban.org/feedbackను ఓపెన్ చేసి, స్వచ్ఛతకు సంబంధించి పది ప్రశ్నలకు జవాబులు ఇవ్వగలరని కోరారు. ఈ సర్వే మార్చి 31 నాటికి పూర్తి అవుతుందన్నారు. కర్నూలు నగర ర్యాంకును జాతీయ స్థాయిలో అగ్రగామిగా నిలబెట్టేందుకు ప్రతి పౌరుడు ఫీడ్‌బ్యాక్ నమోదు చేయాలని కమిషనర్ కోరారు.

ఈవీఎం వేర్ హౌస్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర - కర్నూలు : త్రైమాసిక తనిఖీ లో భాగంగా ఈవిఎంలు భద్రపరచిన వేర్ హౌస్‌ను జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పరిశీలించారు. బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టరేట్ ప్రాంగణంలోని ఈవిఎం వేర్ హౌస్‌లో ఈవీఎంలను భద్రపరచిన తీరును కలెక్టర్ పరిశీలించారు. ఈవీయం వేర్ హౌస్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న పోలీసు గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఈవీయంలను భద్రతపై నిరంతర పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం సంబంధిత రిజిస్టర్ లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. కలెక్టర్ వెంట డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ మురళి, తెలుగుదేశం పార్టీ జనరల్ సెక్రెటరీ ఎల్.వి.ప్రసాద్, బిజెపి స్టేట్ ఎలక్షన్ సెల్ ప్రతినిధి సాయి ప్రదీప్, బీఎస్పీ ప్రతినిధి అరుణ్ కుమార్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ప్రతినిధి ఎన్‌సీహెచ్ బజారన్న పాల్గొన్నారు.

ఏపీ మోడల్ కళాశాలలో దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర-పత్తికొండ: పట్టణంలోని ఏపీ మోడల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విక్టర్ సామేల్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2025-2026 విద్యా సంవత్సరానికి ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులలో ఆంగ్ల మాధ్యమంలో ఉచిత విద్య అభ్యసించే విద్యార్థుల నుండి ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రభుత్వంచే గుర్తించబడిన పాఠశాలల్లో పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈనెల 17 నుండి మే 22 వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 ఆన్లైన్‌లో చెల్లించి, దరఖాస్తు వివరాలు పొందుపరచాలన్నారు. పదో తరగతి మార్కులు మెరిట్ ద్వారా రిజర్వేషన్ రూల్స్ ప్రకారం ప్రవేశాలు ఉంటాయన్నారు.

పోక్సో యాక్టుపై విద్యార్థులకు సదస్సు

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: న్యాయ సేవా అధికార సంస్థ వారు నందనపల్లి మిలటరి కాలనీ నందు గల గవర్నమెంట్ హై స్కూల్‌లో పోక్సో యాక్ట్‌పై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అధితిగా బి.లీలా వెంకట శేషాద్రి, కార్యదర్శి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ హాజరయ్యారు. జడ్జి మాట్లాడుతు అక్కడి పిల్లలకు పోక్సో యాక్ట్‌పై అవగాహన కల్పించారు. లైంగిక నేరాల నుండి రక్షణ చట్టం 2012 ప్రకారం పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు కలవని తెలిపారు. న్యాయ వాది శివరాం, ఇంచార్జి హెడ్ మాస్టర్ షఫీ ఉల్లా, టీచర్స్ పాల్గొన్నారు.

మీసేవ కేంద్రాలను బలోపేతానికి హామీ

విశాలాంధ్రు-హొళగుంద: మీసేవ రాష్ట్ర మీసేవ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రిజిస్ట్రేషన్ 74 /2012 వారి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ మీసేవ ఆపరేటర్లందరికి చల్లని శుభవార్త వినిపించిన రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేష్‌కి మన ఆంధ్రప్రదేశ్ మీసేవ కుటుంబ సభ్యులందరి తరఫున మీసేవ నిర్వాకుడు బకాడీ వీరేష్ బుధవారంఅభినందనలు తెలిపారు. ఎంతో కాలంగా మన యూనియన్ సభ్యులు అందరూ మన మీసే కుటుంబాల అందరికీ మంచి జరగాలని మంచి జరుగుతుందని నమ్మకంతో ఇన్ని రోజులుగా శ్రమించి ఈరోజు అసెంబ్లీలో లోకేష్ మాటల్లో మీ సేవకిమంచి రోజులు వస్తాయని, ఐటి డిపార్ట్మెంట్లలో మనల్ని మేర్జ్ చేస్తామని స్వయంగా లోకేష్ చెప్పడం జరిగిందన్నారు. దీంతో బాణాసంచాలతో పాలాభిషేకలతో అభినందనలు తెలిపారు.

న్యాయమూర్తులతో ముఖాముఖి కార్యక్రమం

విశాలాంధ్ర - కర్నూలు ఎద్యుకేషన్: జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వ రిసోర్స్ పర్సన్స్ సురేష్, జ్యోతి గోపినాథన్ లతో న్యాయమూర్తులకు ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యవర్తిత్వంపై చర్చించారు. మొదటి అదనపు జిల్లా జడ్జి జి.భూపాల్ రెడ్డి, ఆరోఅదనపు జిల్లా జడ్జి పి.పాండు రంగారెడ్డి, జిల్లా న్యాయ సేవధికార సంస్థ కార్యదర్శి బి.లీల వెంకట శేషాద్రి పాల్గొన్నారు.

విద్యార్థినీల ఆకలికేకల కథనంపై ప్రిన్సిపాల్‌పై చర్యలేవి

విచారణ పేరుతో మభ్యపెట్టిన అధికారులు.

విశాలాంధ్ర - క్రిష్ణగిరి: మోడల్ స్కూల్ హాస్టల్ విద్యార్థినిల ఆకలికేకల కథనంపై ప్రిన్సిపాల్‌పై చర్యలేవని, విచారణ పేరుతో అధికారులు మభ్య పెట్టారని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెల 22 తేదీన మోడల్ స్కూల్ హాస్టల్ విద్యార్థుల ఆకలి కేకలు అనే కథనంతో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో 23వ తేదీ హాస్టల్ విద్యార్థులతో సమావేశమై విద్యార్థినిలకు భోజనం సక్రమంగా పెట్టడం లేదని హాస్టల్ ముందు నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు. అదే రోజు విచారణ కొరకు వచ్చిన జిల్లా అధికారి స్నేహలతకు హాస్టల్‌లో వారికి ఇష్టమైన మెనూ పాటిస్తున్నారని వినతి పత్రం ఇవ్వడం జరిగింది అన్నారు. విచారణ ఏమైందో తెలియదు కానీ ఇప్పటికి ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోలేదని, ఉన్నతాధికారులు ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకొని పిల్లలకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. చర్యలు తీసుకోకపోతే అన్ని విద్యార్థి సంఘాలతో కలిసి జిల్లా డీఈవో కార్యాలయం ముందు ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు.

ప్రిన్సిపాల్ హాల్ టికెట్‌కు రూ.300 వసూలు : క్రిష్ణగిరి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ 85 మంది పదో తరగతి విద్యార్థుల దగ్గర నుండి రూ.300ల చొప్పున డబ్బులు వసూలు చేసిందని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు అన్నారు. విద్యార్థినిలకు గతంలో జరిగిన అన్యాయంపై చర్యలు లేకనే ఎవరేం చేస్తారనే ఉద్దేశంతో అక్రమంగా పిల్లల దగ్గర నుండి డబ్బులు వసూలు చేస్తుందన్నారు. ప్రతి విద్యార్థి రూ.300 ఇచ్చేంతవరకు పిల్లలకు హాల్ టికెట్ ఇవ్వలేదని ఆయన అన్నారు. ఇదేమిటని తల్లిదండ్రులు ప్రశ్నిస్తే ఇంటర్ చదివేందుకు పిల్లలకు ఆన్లైన్ చేయిస్తానని చెప్పుకొచ్చారన్నారు. విద్యార్థినీల కదుపు కొడుతూ అన్యాయంగా డబ్బులు వసూలు చేస్తున్న ప్రిన్సిపాల్‌ను వెంటనే విధులనుండి తొలగించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి సభ్యులు అశోకు, ఖాదర్, అబ్బి తదితరులు ఉన్నారు.

ఎంపీపీ భర్త మృతి



విశాలాంధ్ర-గూడూరు: మండల అధ్యక్షురాలు కె.సునీత భర్త, చనుగొండ్ల గ్రామ సీనియర్ వైసీపీ నాయకులు విజయ ప్రతాప్ రెడ్డి బుధవారం హఠాన్మరణం చెందారు. కుటుంబ సభ్యులు వివరాలు ప్రకారం ఈ నెల 17న శ్రీవారి దర్శనార్థం మిత్రులతో కలసి తిరుమలకు వెళ్లి 18న రాత్రి దర్శనం చేసుకుని ఓ గదిలో విశ్రాంతి తీసుకున్నారు. మిత్రులు ఉదయం ప్రతాప్ రెడ్డిని లేపేందుకు ప్రయత్నించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతికి గల కారణాలను పరిశీలించి పార్టీవ దేహాన్ని తిరుమల నుండి స్వగ్రామం చనుగొండ్లకు తరలించారు. భార్య సునితతో పాటు ఇద్దరు కుమార్తెలుండగా పెద్ద కుమార్తెకు ఇటీవల వివాహం అయింది. పలువురు రాజకీయ నాయకులు ప్రతాప్ రెడ్డి మృతికి సంతాపం తెలిపి పార్టీవ దేహానికి నివాళులర్పించారు.

ప్రశాంత వాతావరణంలో పదో తరగతి పరీక్షలు : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : జిల్లాలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. బుధవారం ఉదయం నగరంలోని రాజానగర్‌లోగల బిషప్ సెంట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ గౌతమి నగర్ లోని గుడ్ షెఫర్డ్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో పదవ తరగతి పరీక్షలు జరుగుతున్న తీరును జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పొరపాట్లకు తావు లేకుండా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో మార్చి 17వ తేది నుండి ప్రారంభమైన పదవ తరగతి పరీక్షల కోసం 172 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. 172 పరీక్ష కేంద్రాలలో 40,776 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని కలెక్టర్ తెలిపారు. 208 మంది పరీక్షకు గైర్హాజరయ్యారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా బుధవారం 208 మంది రెగ్యులర్ విద్యార్థులు, ప్రైవేట్‌లో 11 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని కలెక్టర్ తెలిపారు. 172 కేంద్రాలలో ఎలాంటి సంఘటనలు జరగలేదని,

మిగతా పరీక్షలు ప్రశాంత వాతావరణలో పరీక్షలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్‌పాల్‌ను ఆదేశించారు.

కర్ణాటక భక్తులకు భోజన వసతి

విశాలాంధ్ర- ఆదోని రూరల్: ఉగాది పండుగను పురస్కరించుకొని శ్రీశైలంలో జరిగే ఉగాది బ్రహ్మోత్సవాలకు ఆదోని మీదుగా పాద యాత్రగా వెళ్లే భక్తుల కోసం భోజన వసతిని కల్పిస్తున్నట్లు అల్కురిమఠ మహర్షి విజయ్ కుమార్ స్వామి ప్రకటన ద్వారా మీడియాకు తెలిపారు. ఈనెల 21 నుంచి 24 వరకు ఆదోని-ఎమ్మిగనూరు బైపాస్ రోడ్డులోని శ్రీ సరస్వతి అమ్మ ఆలయంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని పాదయాత్ర చేసే భక్తులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అన్న ప్రసాద వితరణ కార్యక్రమములో పాల్గొన్న ప్రతి ఒక్కరు భక్తులకు అన్నప్రసాద వితరణ చేయవచ్చని విజ్ఞప్తి చేశారు. ఎంతో సంకల్పంతో అల్కురి మఠం మహర్షి కుటుంబంతో పాటు బంధువులు,స్నేహితుల దాతల సహాయంతో కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుంది.

మధ్యవర్తిత్వంపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - కర్నూలు ఎద్యుకేషన్: జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి బి.లీల వెంకట శేషాద్రి, కేరళ నుండి వచ్చిన మీడియేషన్ రీసోర్స్ పర్సన్స్ సురేష్ పిజి, జ్యోతి గోపి నాథన్ కర్నూలు బార్ అసోసియేషన్ నందు న్యాయ వాదులకు మీడియేషన్ పై అవగాహన నిర్వహించారు. సురేష్ మాట్లాడుతూ మీడియేషన్ వల్ల కలిగే లాభాలు, మీడియేషన్‌ను ఉపయోగించి కేసులు ఎలా త్వరిత గతిన పరిష్కరించాలో న్యాయవాదులకు వివరించారు. న్యాయవాదులు తమ కక్షిదారులను మధ్యవర్తిత్వం దిశగా ఒప్పించేందుకు కృషి చేయాలన్నారు. కోర్టులో పెండింగ్ ఉన్న వీలైనన్ని ఎక్కువ కేసులు మీడియేషన్ దిశగా పరిష్కరించుకునేలా కృషి చెయ్యాలని కోరారు. మీడియేషన్ రూల్స్, రెగ్యులేషన్స్, యాక్ట్‌ల గురించి న్యాయవాదులకు వివరించారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.కృష్ణమూర్తి, సెక్రటరీ బీఎస్ రవికాంత్ ప్రసాద్, బార్ మెంబెర్స్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రిజిస్ట్రేషన్ సదుపాయం కల్పించాలి : సీపీఐ

విశాలాంధ్ర - మంత్రాలయం: రైతులకు రిజిస్ట్రేషన్ సదుపాయం కల్పించాలని సీపీఐ నాయకులు కోరారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలోని తహశీల్దార్ రవికు సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి డి.విజయ భాస్కర్ యాదవ్‌కు సీపీఐ నాయకులతో కలిసి వినతులతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు తహశీల్దార్‌కు తెలియజేస్తూ ఇంతకు ముందు ప్రభుత్వంలో ఈనామ్ అనే పేరును తొలగించి, రైతులకు రిజిస్ట్రేషన్ సదుపాయం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. మంత్రాలయం మండలంలోని బూదూరు సూగూరు చాలా గ్రామాలలో రీసర్వే పేర్లతో సర్వేయర్లు ఇష్ట రాజ్యాంగ వ్యవహరించారన్నారు. రైతులకు అవకతవకలు మధ్య సర్వే చేయించారన్నారు. సంబంధిత అధికారులు రీ సర్వే ఏర్పాటు చేసి నష్టపోయిన రైతులకు రీ సర్వే చేయించి వారి పేర్లను నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆర్‌వోఆర్ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తొందరగా సమస్యలను పరిష్కరించాలన్నారు. సీపీఐ నాయకులు పంపాపతి, గాబ్రియేలు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వైఎస్సార్

విశాలాంధ్ర - కోడుమూరు: పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసి ,ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడు దివంగత నేత వైఎస్సార్ మాత్రమేనని వైసిపి జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి అన్నారు. విగ్రహాలకు నిప్పు పెట్టి, జెండాలను కాల్చడం వంటి దుర్మార్గపు చర్యలకు పాల్పడటం వల్ల వైఎస్సార్ ఆశయాల సాధన కోసం నిరంతరం శ్రమిస్తున్న పార్టీ అధినేత వైఎస్ జగన్ పట్ల ప్రజల గుండెల్లో ఉన్న అభిమానాన్ని, ఆయనకున్న స్థానాన్ని చెరిపి వేయలేరన్నారు. కోడుమూరులో మంగళవారం గుర్తు తెలియని దుండగులు మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నిప్పు పెట్టి ధ్వంసం చేసేందుకు యత్నించిన ఘటనలో దెబ్బతిన్న వైఎస్ఆర్ విగ్రహాన్ని పరిశీలించేందుకు జిల్లా వైసీపీ అధ్యక్షులు ఎస్వి మోహన్ రెడ్డి, ఆదోని మాజీ ఎమ్మెల్యే వై సాయిప్రసాద్ రెడ్డి, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, కోడుమూరు జడ్పిటిసి రఘునాథరెడ్డిలు వైసిపి శ్రేణులతో కలిసి బుధవారం ఉదయం కర్నూలు-కోడుమూరు రహదారిలోని మొండికట్ట వాగు బ్రిడ్జి వద్దనున్న విగ్రహం వద్దకు చేరుకున్నారు. వైసిపి నాయకులు కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, విజయకుమార్ రెడ్డి, రవికుమార్ రెడ్డి, ప్రవీణ్, రాంపురం శివరాముడు,వార్డు సభ్యులు వీర, ఆకుల రవి, కౌలుట్ల, లింగమూర్తి, సుబ్బారావు స్వామి, వెంకటేష్, జగదీష్, వీరన్న, రాఘవేంద్ర, రవి, గోపిలు పాల్గొన్నారు.

రేషన్ కార్డుదారులు ఈకేవైసీ చేసుకోవాలి

విశాలాంధ్ర - నందవరం: రేషన్ కార్డుదారులు ఈకేవైసీని తప్పని సరిగా చేయించుకోవాలని తహసీల్దార్ కె.శ్రీనివాసులు తెలిపారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, డీలర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో గల రేషన్ కార్డులలో 7836 మంది సభ్యులు ఇంకా ఈకేవైసి చేసుకోలేదని, ఇందులో చిన్న పిల్లలు, పెద్దవాళ్లవి కూడా ఉన్నాయన్నారు. వాటి జబితా సంబంధిత గ్రామ రేషన్ షాపు డీలర్లకు ఇవ్వడం జరిగిందని, పెళ్లిచేసుకోని శాశ్వతంగా గ్రామం వదిలి వేసిన వారివి, చనిపోయినవారిని గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సుబ్బారెడ్డి, వీఆర్వోలు, డీలర్లు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధి, సాధికారతకు కృషి చేయాలి

విశాలాంధ్ర-పత్తికొండ: నియోజకవర్గ అభివృద్ధి, సాధికారతకు ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి క్రాంతి నాయుడు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో అనేక ఉద్యమాలు చేపట్టిన ఫలితంగానే ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. నియోజకవర్గంలో అనేక సమస్యలు నెలకొన్నాయని, పత్తికొండలో రోడ్ల విస్తరణ పనులు, ఏరియా ఆసుపత్రి నిర్మాణం, పంటల ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలన్నారు. వృత్తి విద్య కోర్సుల్లో విద్యను అభ్యసిం చేందుకు సుదూర ప్రాంతాలకు వెళ్లి విద్యనభ్యసిస్తున్నారని, ప్రభుత్వ పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కళాశాలలు బీసీ బాలికల వసతి గృహం ఏర్పాటు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

భోజనశాల ఏర్పాటు

విశాలాంధ్ర-సి.బెళగల్: మండల పరిధిలోని ముదుమాల గ్రామం హైస్కూల్‌లో కీ.శే. నాయకంటి వెంకట ప్రతాప్ రెడ్డి ఆయన సతీమణి కీర్తిశేషులు మాణిక్యమ్మల గుర్తుగా భోజన శాలను ఆయన మనవళ్లు, మనవరాళ్లు, అల్లుడు బుధవారం ఘనంగా ప్రారంభం చేశారు. కీ.శే. నాయకంటి ప్రతాప్ రెడ్డి వారి ధర్మపత్ని కీశే నాయకంటి మాణిక్యమ్మల జ్ఞాపకార్థం విద్యార్థులకు నిర్మించాలని తలంపు చేసిన కుమారుడు రాధాకృష్ణ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కృష్ణ చైతన్య రెడ్డిల కళ నెరవేర లేదు. నాయకంటి రాధాకృష్ణారెడ్డి మరణం అనంతరం కుమారులు పవన్ రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, మేఘనా రెడ్డి ఉమా మహేశ్వర్ రెడ్డిలు సుమారు ఏడు లక్షలు వెచ్చించి 130 అడుగుల పొడవునా ముప్పై అడుగుల వెడల్పునా ఈ భోజన శాల సౌకర్యవంతంగా నిర్మించి బుధవారం ఘనంగా కుటుంబ సభ్యులందరూ కలిసి ప్రారంభం చేశారు. గ్రామ పెద్దలు కీశే నాయకంటి ప్రతాపరెడ్డి చిన్న కుమారుడు నాయకంటి జగదీశ్వర రెడ్డిపాల్గొని భోజనశాలకు అవసరమైన ఫ్యాన్లు ఇస్తానన్నారు. కొండాపూరం గ్రామ పెద్దలు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు గోపాల్ రెడ్డి దంపతులు భోజన టేబుళ్ళను అందిస్తామని అన్నారు.

నిర్దిష్ట వేళలు పాటించకుంటే చర్యలు తప్పవు

విశాలాంధ్ర - కర్నూలు ఎద్యుకేషన్ : జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలలు ఒంటిపూటబడులను నిర్దిష్ట వేళలు పాటించకుండా ఇష్టానుసారంగా నడిపితే చర్యలు తప్పవని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.సామెల్ పాల్ తెలిపారు. ఈ విషయంపై తమ దృష్టికి వస్తే పాఠశాలల మూసివేతకు ఆదేశాలు ఇవ్వడం జరుగుతుందని, ఒంటి పూట బడులకు సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన సమయం ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు.

నాటుసారాకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర - పెద్దకడబూరు : నాటుసారా రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా పని చేస్తామని కోసిగి ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నాటుసారా, నిర్మూలన కోసం నవోదయం 2.0 అనే కార్యక్రమంలో భాగంగా బుధవారం పెద్దకడబూరు మండలంలోని ముచ్చిగిరి గ్రామంలో నాటుసారా రహిత సమాజ నిర్మాణం కోసం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా అలవాటు ఉన్న ప్రజానికం, నాటుసారా తయారీ, విక్రయం నేర ప్రవృతి గలవారు వాటికి దూరంగా ఉండాలని సూచించారు. నాటుసారాకు దూరంగా ఉండకపోతే బైండోవర్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ హనుమంతు, టీడీపీ టౌన్ అధ్యక్షులు బెల్లం ఈరన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు ఆమోదం పట్ల హర్షం

విశాలాంధ్ర - పెద్దకడబూరు : ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలవడం పట్ల ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు యువరాజ్ మాదిగ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం పెద్దకడబూరులో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ గత 30 ఏళ్ల నుంచి మందకృష్ణ మాదిగ ఎస్సీలో ఉన్న 59 ఉప కులాలను ఏబీసీడీలుగా వర్గీకరణ చేయాలని చేస్తూ ఉన్నారని తెలిపారు. గత సంవత్సరం ఆగస్టు నెలలో ఆయా రాష్ట్రాలు ఎస్సీ వర్గీకరణ చేసుకోవచ్చని సుప్రీంకోర్టు సంచలన తీర్పు ఇచ్చిందన్నారు. ఎస్సీ వర్గీకరణ ద్వారానే 59 ఉప కులాలకు సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. చంద్రబాబుకు మాదిగలు, ఇతర ఎస్సీ ఉప కులాలు రుణపడి ఉంటారని ఆయన వెల్లడించారు.

వ్యాపారస్తులకు దుకాణాలు నిర్మించాలి

విశాలాంధ్ర-మంత్రాలయం: మండలంలోని మంచాల గ్రామం పాత ఊరు, సంత మార్కెట్లో కూరగాయల వ్యాపారస్తులకు దుకాణాలు ఏర్పాటు చేయాలని ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు కె.చిన్న, మండల కార్యదర్శి ఎం.రాజులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచాల గ్రామంలో వారంలో ప్రతి గురువారం ఇక్కడ వారపు సంత జరుగుతుందని, ఇక్కడ జరిగే సంతలో ప్రజలకు వారి జీవన విధానానికి సరిపోయే కూరగాయలు ఇతర వస్తువుల వ్యాపారం చేసుకోవడానికి సరైన దుకాణాల సముదాయం లేదన్నారు. వర్షాకాలంలో తీవ్ర అవస్థలు చెందుతూ వ్యాపారాలు చేసుకుంటున్నాంని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రాలయం గ్రామ పంచాయతీకి ప్రతి సంవత్సరం టెండర్ రూపంలో లక్షల్లో ఆదాయం వస్తూ ఉంటుందన్నారు. ఈ ఆదాయాన్ని దుకాణ సముదాయాలకు వినియోగించాలన్నారు. అక్కడ కనీస సౌకర్యాలు అయిన మరుగుదొడ్లు, తాగునీరు వంటి సౌకర్యాలను కల్పించాలని మంత్రాలయం

మండల తహసీల్దార్ రవి, గ్రామ పంచాయతీ కార్యదర్శిలకు ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు కె.చిన్న, మండల కార్యదర్శి ఎం.రాజు, పట్టణ నాయకులు జి.మోహన్, డి.ఫణీంద్ర, ఎం.విజయ్‌ల ఆధ్వర్యంలో వేరువేరుగా వినతి పత్రాలు అందజేశారు.

విద్యార్థినీలకు అవగాహన సదస్సు

విశాలాంధ్ర - కర్నూలు ఎద్యుకేషన్: న్యాయ సేవా అధికార సంస్థ వారు పెద్దపాడులోని గవర్నమెంట్ బాలికల హై స్కూల్‌లో పోక్సో యాక్ట్‌పై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అధితిగా సినియర్ సివిల్ జడ్జి పి. దివాకర్, మాట్లాడుతు అక్కడి పిల్లలకు పోక్సో యాక్ట్‌పై అవగాహన కల్పించారు. లైంగిక నేరాల నుండి రక్షణ చట్టం 2012 ప్రకారం పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు ఉన్నాయని తెలిపారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, గురువారం 20, మార్చి 2025

ఈ నెల 22న డిప్యూటీ సీఎం జిల్లాకు రాక

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ఈ నెల 22వ తేదీన డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ జిల్లాకు రానున్నారని, ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లాలలో డిప్యూటీ సీఎం పర్యటన సందర్భంగా ఏర్పాట్లపై కలెక్టర్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా రాబోయే జూన్ లోపు రెండు లక్షల ఫార్మ్ పాండ్స్‌లను పూర్తి చేయాలన్న లక్ష్యంతో నిర్మిస్తున్న సందర్భంగా జిల్లాలో డిప్యూటీ సీఎం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారని తెలిపారు. ఇందులో భాగంగా కర్నూలు జిల్లాలో 8500 ఫార్మ్ పాండ్స్ నిర్మించడం జరుగుతోందని, ఓర్వకల్లు మండలం పూడిచర్ల గ్రామ పరిధిలో ఫార్మ్ పాండ్‌కు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భూమిపూజ చేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. తొలుత ఓర్వకల్లు ఎయిర్పోర్ట్ కు చేరుకొని అనంతరం, పూడి చెర్లలో ఫార్మ్ పాండ్‌కు భూమి పూజ చేస్తారని, తదుపరి బహిరంగ సభలో డిప్యూటీ సీఎం పాల్గొంటారని, అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి ఓవరాల్ ఇన్చార్జ్‌గా కర్నూలు ఆర్డీవో ఉంటారని కలెక్టర్ తెలిపారు. బందోబస్తు, స్టేజ్ అరేంజ్మెంట్స్, బ్యారికేడింగ్, బహిరంగ సభ ప్రాంతంలో పారిశుధ్య ఏర్పాట్లు, సౌండ్ సిస్టమ్,శిలా ఫలకం, బ్యాక్ డ్రాప్, తాగునీటి సరఫరా తదితర ఏర్పాట్లన్నీ గురువారం సాయంత్రానికి ఒక కొలిక్కి రావాలని, శుక్రవారం సాయంత్రం లోపు అన్ని ఏర్పాట్లు పూర్తి కావాలని కలెక్టర్ కర్నూలు ఆర్‌డీఓ, జడ్పీ సీఈవో, పీడీ డ్వామా, ఎస్ఈఆర్ అండ్ బీ, పీడీ డీఆర్డీఏ, పీడీ మెప్మా, డీఎస్పీ, జెడ్పీ సీఈవో, ఎస్ఈ ఆర్డబ్ల్యుఎస్, ఓర్వకల్లు తహశీల్దార్, ఎంపీడీవోలను ఆదేశించారు. ఈ అధికారులు బుధవారం సాయంత్రం పూడిచెర్ల గ్రామానికి వెళ్ళి ఏర్పాట్లను పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. టెలికాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, డీఆర్వో వెంకటనారాయణమ్మ, కర్నూలు ఆర్డీవో సందీప్, జడ్పీ సీఈవో నాసర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వలస మంద

కన్న పిల్లలను వదిలి ఆవులను మేపేందుకు వచ్చిన యజమానులు

విశాలాంధ్ర - రుద్రవరం: కుటుంబ జీవన శైలిలో ఒక్కొక్కరు ఒక్కో రంగాన్ని ఎంచుకొని కుటుంబాన్ని పోషించుకుంటూ బ్రతుకుతుంటారు. ఇంకొందరు మూగజీవాలైన గొర్రెలు, మేకలు, ఆవులు, గేదెలను పెంచుకుంటూ ఎంతో కష్టాన్ని భరిస్తూ వాటిని పెంచుకుంటూ వారి కుటుంబాన్ని తమ పిల్లలను పోషించుకుంటూ ఉంటారు. తమ ప్రాంతంలో ఉన్నట్టుండి మూగజీవాలకు మేత లేకపోతే జిల్లాలు మారుతూ మేత కోసం సుదూర ప్రాంతాలకు వలస మందగా వస్తున్నారు. వివరాల్లోకి వెళితే గడివేముల మండలంలోని ఎల్కే తాండ గ్రామానికి చెందిన మద్దిలేటి నాయక్, కృష్ణ నాయక్, స్వామి నాయక్‌లకు చెందిన దాదాపు వెయ్యి ఆవుల మందను మేత కోసం మండలంలోని చిలకలూరి గ్రామ పొలిమేరలోకి వచ్చి ఆవులను మేపుకుంటున్నారు. తమ మూగజీవాలకు తమ ప్రాంతంలో మేత లేకపోవడంతో ఆవులను బ్రతికించుకునేందుకు తమ కన్న బిడ్డలను, వృద్ధులను, ఇంటిని వదిలి ఎంతో వ్యయ ప్రయాసలకు ఓర్చుకొని వచ్చామంటున్నారు. ఈ ప్రాంతంలోనే వచ్చే నాగుల చవితి వరకు ఉంటూ మేతను మేపుకొని ఉంటామంటున్నారు. కేవలం అక్కడ మేత లేకపోవడంతోనే ఇంత దూరం రావాల్సి వచ్చిందని ఆవుల మంద యజమాను రాళ్లయిన అరుణ భాయ్, పార్వతి బాయి లు తెలిపారు.

చంద్రబాబుతో సమావేశమైన టీడీపీ ఎంపీలు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో సమావేశం అయ్యేందుకు ఢిల్లీ చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పార్లమెంట్ ఆవరణలోని టీడీపీ పార్లమెంట్ కార్యాలయంలో టీడీపీ ఎంపీలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. పార్లమెంట్‌లో రాష్ట్ర సమస్యలు లేవనెత్తి రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు రాబట్టేలా ఎంపీలు సమన్వయంతో పనిచేయాలని సీఎం ఎంపీలను ఆదేశించారు. ఎంపీలకు కేటాయించిన కేంద్ర ప్రభుత్వ శాఖలపై నిరంతర పర్యవేక్షణ, ఎక్కువ నిధులు త్వరగా రాష్ట్రానికి విడుదల అయ్యేలా పని చేయాలని ఎంపీలను ఆదేశిస్తూ నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి సలహాలు, సూచనలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అందజేశారు.

క్కీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

విశాలాంధ్ర- కోవెలకుంట్ల: పట్టణ పరిధిలోని విక్కీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరాన్ని ప్రారంభం చేశారు. విక్కీ ఫౌండేషన్ అధినేత విక్కీ రెడ్డి చేపట్టిన ఈ కార్యక్రమంవిశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 మంది యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయడం జరిగింది. వేసవికాలం కావడం వలన రక్తం కొరతతో పేషెంట్లు రక్తనిధులు ఇబ్బంది పడుతున్న కారణంగా విక్కీ ఫౌండేషన్ అధ్యక్షుడు విక్కి రెడ్డి రక్తదానం ఏర్పాటుచేసి విజయవంతంగా నిర్వహించారు. విక్కీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నంద్యాల బ్లడ్ బ్యాంక్ వారి సహకారంతో నిర్వహించారు.

శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవానికి బీసీ రాజా రెడ్డికి ఆహ్వానం

విశాలాంధ్ర - బనగానపల్లె: మండలంలోని పసుపుల గ్రామంలో ఏప్రిల్ ఏడో తేదీన నిర్వహించనున్న శ్రీ సీతారాముల కళ్యాణం మహోత్సవానికి పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డికి ఆహ్వానించారు. శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకొని పసుపల గ్రామంలో ఏప్రిల్ ఆరో తేదీ నుండి 10వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు బాల నాయుడు, షేక్షావలి, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, బుధవారం బిసి రాజారెడ్డిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. శ్రీ సీతారాముల కళ్యాణం మహోత్సవంలో పాల్గొనాలని కోరారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు

విశాలాంధ్ర - చాగలమర్రి: దుకాణాలు, మెకానిక్ షెడ్లు హోటళ్ళు తదితర వాటిల్లో 18 ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని జిల్లా సహాయ కార్మిక శాఖ అధికారి మురళీకృష్ణ హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని వివిధ దుఖాణాలు, మెకానిక్ షెడ్లను తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సిపిసిఆర్ ఆదేశాల మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. పిల్లలను పనిలో పెట్టుకుంటే యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం బాల కార్మిక నిర్మూలన సంబంధించిన పోస్టర్లను అతికించారు. హెడ్ కానిస్టేబుల్ శంకర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అదనపు ఆర్థిక సాయం గురించి అవగాహన

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్: పట్టణంలోని స్థానిక చక్రం లేఅవుట్ నందు హౌసింగ్ పీడీ హరి గోపాల్, డీఈ నాగార్జున, ఏఈ ఉమామహేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ హరి గోపాల్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీవీటీజీ వర్గాలకు చెందిన గృహ నిర్మాణ లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ పథకం ద్వారా బీసీ, ఎస్సీ, లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, పివిటీజీ లకు ఒక లక్ష రూపాయలు అదనంగా ఇవ్వనున్నారు.

దేవస్థాన భూములను కాపాడండి : సీపీఐ

విశాలాంధ్ర - నంద్యాల అర్బన్: బేతంచెర్ల పట్టణ, మండలంలోని గ్రామాల్లోని దేవస్థానం భూములను అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు డిమాండ్ చేశారు. దేవస్థానం భూములను కాపాడాలని కోరుతూ సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగ నాయుడు, సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, బేతంచెర్ల మండల కార్యదర్శి వై.భార్గవ్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.సోమన్న, సీనియర్ నాయకులు సంజీవులు, ఏఐటీయుసి పట్టణ కార్యదర్శి డి.శ్రీనివాసులుతో కలిసి జిల్లా దేవాదాయ శాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్.రంగనాయుడు మాట్లాడుతూ జిల్లా బేతంచెర్ల పట్టణం మరియు మండలంలోని గ్రామాలలో వున్నా ఆంజనేయస్వామి, చెన్నకేశవ స్వామి, మాధవ స్వామి, గట్టు నరసింహస్వామి ఆలయాలకు చెందిన సుమారు 200 ఎకరాల భూములు ఉన్నాయన్నారు. గత ప్రభుత్వంలో ఉన్న నాయకులు ప్రస్తుత ప్రభుత్వంలో ఉన్న నాయకులు తమకు వున్న పలుకుబడిని ఉపయోగించి దేవస్థాన భూములను కబ్జా చేసి దేవస్థానాలకు వచ్చే ఆదాయమును సైతం గండీకొట్టి అనుభవిస్తున్నారని ఆరోపించారు. ఇల్లు లేని నిరుపేదలు రెండు సెంట్ల ఇంటి స్థలం ఆక్రమించి ఇల్లు నిర్మించు కుంటే వాటిని స్వాధీనం చేసుకునే అధికారులు ఇంత పెద్ద స్థాయిలో దేవస్థానం భూములు ఆక్రమణకు గురవు తుంటే అధికారులు మాత్రం నిమ్మకు నిరెత్తినట్లు వ్యవహరిస్తు న్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమణకు గురైన భూములు ప్రస్తుత బహిరంగ మార్కెట్లో సుమారు 200 కోట్ల రూపాయలు విలువ ఉంటుందని అన్నారు. దేవుని మాన్యం భూములను అక్రమణదారుల నుండి కాపాడాలన్నారు.

ప్రమాదాలు తలెత్తకుండా ప్రమాణాలు పాటించండి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : పరిశ్రమల్లో ఆకస్మిక ప్రమాదాలు సంభ వించినప్పుడు పర్యావరణ పరిరక్షణ చట్టం 1986 ప్రకారం భద్రతా ప్రమాణా లను ఖచ్చితంగా పాటించాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ పరిశ్రమల యాజమాన్యాలను సూచించారు. బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిక్ట్ క్రైసిస్ గ్రూప్ సమావేశాన్ని జాయింట్ కలెక్టర్ నిర్వహించారు. సమావేశంలో నంద్యాల ఆర్డీఓ విశ్వనాథ్, పరిశ్రమల శాఖ డిప్యూటీ ఇన్స్పెక్టర్ నారాయణ రెడ్డి, జిల్లా విపత్తు నిర్వహణ, అగ్నిమాపక శాఖ అధికారి జి.బాలరాజు, ఎస్డిఆర్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ సుధాకర్ రెడ్డి, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు. జేసీ మాట్లాడుతూ పరిశ్రమల్లో అనుకోని ప్రమాదాలు సంభవించినప్పుడు వాటిని ఎదుర్కొనేందుకు భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని పరిశ్రమల యాజమాన్యాలను సూచించారు. పరిశ్రమల్లో మాక్ డ్రిల్స్ నిర్వహించే సమయంలో సంబంధిత అధికారులను అందరూ పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని పరిశ్రమల శాఖ జీఎంను ఆదేశించారు. పరిశ్రమల్లో ఏవైనా చిన్న లోపాల వల్ల ఆన్‌సైట్‌లో ఏర్పడిన ప్రమాదాన్ని అక్కడే నివారించి, ఆఫ్ సైట్‌లోకి ప్రమాదం వ్యాపించకుండా తప్పనిసరి చర్యలు తీసుకోవాలన్నారు.

ఇంకుడు, ఎరువుగుంతలు ఏర్పాటు చేయండి

విశాలాంధ్ర - చాగలమర్రి: గ్రామాల్లో ఎరువుల గుంతలు, పారంపాండ్లు, ఇంకుడు గుంతలను గుర్తించి వాటిని ఏర్పాటు చేయాలని ఉపాధి ఏపీడి సాంబశివరావు తెలిపారు. చాగలమర్రి పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇంకుడు గుంతలను గుర్తించి వాటిని మంజూరు చేసి వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. అలాగే గ్రామాల్లో ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలన్నారు. గ్రామాల్లో అవసరమైన పనులను గుర్తించి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఎంపీడీవో రాజేంద్రప్రసాదు, ఏపీవో నిర్మల, సిబ్బంది పాల్గొన్నారు.

అటవీ సంరక్షణకు గేటు ఏర్పాటు

విశాలాంధ్ర - రుద్రవరం: మండలంలోని పెద్దకంబలూరు గ్రామ సమీపం లోని నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న తెలుగు గంగ ప్రధాన కాలువ వంతెనపై అటవీ సంరక్షణలో భాగంగా గేటు ఏర్పాటు చేసినట్లు సెక్షన్ ఆఫీసర్ కిషోర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ చలమ రేంజ్ పరిధిలో ఉన్న పెద్దకంబలూరు సెక్షన్ నల్లమల అటవీ ప్రాంతంలో నేరాలు జరగకుండా ఉండేందుకు వంతెనపై గేటు ఏర్పాటు చేయడం వల్ల ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అడవుల్లోకి పశువులను మేత కోసము తీసుకొని వెళ్లి వదిలేస్తున్నారన్నారు. పశువులు చెట్లను కొమ్ములతో వృద్ధి విరిగిపోయేటట్లు చేస్తున్నాయన్నారు. కొందరు వ్యక్తులు అక్రమంగా అడవుల్లో ప్రవేశించి వంట చెరుకు వెదురు రవాణా చేస్తున్నారన్నారు. అడవులను సంరక్షించేందుకు గేటు ఏర్పాటు చేశామన్నారు. ఎవరు అధికారుల అనుమతి లేకుండా అడవుల్లోకి ప్రవేశించరాదన్నారు. గేటు ఏర్పాటు లో బీట్ ఆఫీసర్ రామారావు సిబ్బంది ఉన్నారు.

ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వైఎస్సార్

విశాలాంధ్ర - కోడుమూరు: పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసి ,ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడు దివంగత నేత వైఎస్సార్ మాత్రమేనని వైసిపి జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి అన్నారు. విగ్రహాలకు నిప్పు పెట్టి, జెండాలను కాల్చడం వంటి దుర్మార్గపు చర్యలకు పాల్పడటం వల్ల వైఎస్సార్ ఆశయాల సాధన కోసం నిరంతరం శ్రమిస్తున్న పార్టీ అధినేత వైఎస్ జగన్ పట్ల ప్రజల గుండెల్లో ఉన్న అభిమానాన్ని, ఆయనకున్న స్థానాన్ని చెరిపి వేయలేరన్నారు. కోడుమూరులో మంగళవారం గుర్తు తెలియని దుండగులు మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నిప్పు పెట్టి ధ్వంసం చేసేందుకు యత్నించిన ఘటనలో దెబ్బతిన్న వైఎస్ఆర్ విగ్రహాన్ని పరిశీలించేందుకు జిల్లా వైసీపీ అధ్యక్షులు ఎస్వి మోహన్ రెడ్డి, ఆదోని మాజీ ఎమ్మెల్యే వై సాయిప్రసాద్ రెడ్డి, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, కోడుమూరు జడ్పీటీసి రఘునాథరెడ్డిలు వైసిపి శ్రేణులతో కలిసి బుధవారం ఉదయం కర్నూలు-కోడుమూరు రహదారిలోని మొండికట్ట వాగు బ్రిడ్జి వద్దనున్న విగ్రహం వద్దకు చేరుకున్నారు. వైసిపి నాయకులు కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, విజయకుమార్ రెడ్డి, రవికుమార్ రెడ్డి, ప్రవీణ్, రాంపురం శివరాముడు,వార్డు సభ్యులు వీర, ఆకుల రవి, కౌలుట్లలు పాల్గొన్నారు.

భోజనశాల ఏర్పాటు

విశాలాంధ్ర-సి.బెళగల్: మండల పరిధిలోని ముడుమాల గ్రామం హైస్కూల్‌లో కీ.శే. నాయకంటి వెంకట ప్రతాప్ రెడ్డి ఆయన సతీమణి కీర్తిశేషులు మాణిక్యమ్మల గుర్తుగా భోజన శాలను ఆయన మనవళ్ళు, మనవరాళ్లు, అల్లుడు బుధవారం ఘనంగా ప్రారంభం చేశారు. కీ.శే. నాయకంటి ప్రతాప్ రెడ్డి వారి ధర్మపత్ని కీశే నాయకంటి మాణిక్యమ్మల జ్ఞాపకార్థం విద్యార్థులకు నిర్మించాలని తలంపు చేసిన కుమారుడు రాధాకృష్ణ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కృష్ణ చైతన్య రెడ్డిల కళ నెరవేర లేదు. నాయకంటి రాధాకృష్ణారెడ్డి మరణం అనంతరం కుమారులు పవన్ రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, మేఘనా రెడ్డి ఉమా మహేశ్వర్ రెడ్డిలు సుమారు ఏడు లక్షలు వెచ్చించి 130 అడుగుల పొడవునా ముప్పై అడుగుల వెడల్పునా ఈ భోజన శాల సౌకర్యవంతంగా నిర్మించి బుధవారం ఘనంగా కుటుంబ సభ్యులందరూ కలిసి ప్రారంభం చేశారు. గ్రామ పెద్దలు కీశే నాయకంటి ప్రతాపరెడ్డి చిన్న కుమారుడు నాయకంటి జగదీశ్వర రెడ్డిపాల్గొని భోజనశాలకు అవసరమైన ఫ్యాన్లు ఇస్తానన్నారు. కొండాపూరం గ్రామ పెద్దలు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు గోపాల్ రెడ్డి దంపతులు భోజన టేబుళ్ళను అందిస్తామని అన్నారు.

వేసవిలో సరైన జాగ్రత్తలు పాటించాలి

విశాలాంధ్ర - నంద్యాల రూరల్: ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉండటం వల్ల వృద్ధులు, పెద్దలు చిన్నపిల్లలు సరైన జాగ్రత్తలు పాటించి తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఎండ తీవ్రత నుండి రక్షణ పొందవచ్చని డిప్యూటీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి వెల్లడించారు. బుధవారం ఆయన విశాలాంధ్రతో ఫోన్ ద్వారా మాట్లాడుతూ ప్రజలు బయటికి వెళ్లేటప్పుడు తప్పనిసరిగా నీటి బాటల్ తీసుకెళ్లాలని అలాగే దాహం లేకపోయినా తప్పనిసరిగా 10 నిమిషాలకు ఒకసారి నీళ్లు త్రాగాలని అలాగే పండ్లతోపాటు నిమ్మరసం కలిపిన ద్రవపదార్థాలు ఎక్కువ శాతం సేవించాలన్నారు. కాగా అవసరాల నిమిత్తం బయటికి వెళితే వెడల్పు లాంటి టోపీలు, కళ్లద్దాలు వాడాలన్నారు. ముఖ్యంగా చల్లని వాతావరణం ఉన్నప్పుడు మాత్రమే తమ కార్యకలాపాలను త్వరగా ముగించుకొని ఇంటికి చేరుకోవాలన్నారు. ప్రస్తుతం తీవ్రమైన ఎండలు ఉండడం వల్ల ఉదయం 10 గంటలనుండి సాయంకాలం నాలుగు గంటల వరకు బహిరంగ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని తెలిపారు. వడదెబ్బ నుండి తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చు అన్నారు. పిల్లలు మొదలుకొని పెద్దల వరకు నూలు దుస్తులు ధరించాలని పిల్లలకు పొడవాటి ప్యాంటు, పొడవాటి చేతుల చొక్కాలు ధరించాలన్నారు. ప్రధానంగా గర్భిణీ స్త్రీలు, వృద్ధులు, శిశువులు, పిల్లలకు దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఉన్నవారు బయటకు వెళ్లకూడదని సూచించారు. ఇంటిలో ఉన్న సమయంలో ఫ్యాన్, ఎయిర్ కూలర్ లాంటివి తప్పనిసరిగా ఉపయోగించుకోవాలని ఆయన తెలియజేశారు. ఈతకు వెళ్లే పిల్లలు కొలనులో, సరస్సులో, నదుల్లో ఈత కొట్టు వారు పెద్దల పర్యవేక్షణలోనే స్నానాలు ఆచరించాలన్నారు. తీవ్రమైన వేడి వల్ల వడదెబ్బ వంటి ప్రాణాంతకమైన ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు కనిపిస్తే వెంటనే చల్లని నీటిలో నూలు వస్త్రాన్ని ముంచి తలకు చుట్టుకోవాలన్నారు. దగ్గరలోని వైద్యులను సంప్రదించి తగిన సలహాలు సూచనలు పాటించి జాగ్రత్తలు తీసుకుంటే వడి దెబ్బ లాంటి ఆరోగ్య సమస్యల నుండి రక్షించుకోవచ్చు అని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు.

మాబాష కుటుంబానికి న్యాయం చేసిన ఫిరోజ్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : పట్టణంలో ఈ నెల 9వ తేదీన ఛాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టు విజయం సాధించడంతో క్రికెట్ సంబరాల్లో చోటుచేసుకున్న దుర్ఘటనలో తోపుడు పండ్ల వ్యాపారి మాబాషా కంటిచూపును కోల్పోయారు. ఈ విషాదకర సంఘటన తెలుసుకున్న వెంటనే ఫిరోజ్ ఆసుపత్రికి చేరుకుని, నేరుగా వైద్యులతో మాట్లాడి మాబాషా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి, అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఫిరోజ్ ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా ఇరు పక్షాలతో మాట్లాడి రాజీ కుదిర్చి, మాబాష కుటుంబానికి ఆర్థిక సహాయం అందేలా కృషి చేశారు. ప్రభుత్వం తరపున అన్ని సహాయ సహకారాలు అందిం చేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కనీసం వారి కుటుంబానికి తోడుగా ఉండేలా ఆర్థిక సహాయం అందేలా కృషి చేయడం జరిగిందన్నారు. కంటి వైద్యుల సూచనలు మబాషాకు కంటిని అమర్చేలా కృషి చేస్తామన్నారు.

పరీక్షా కేంద్రాల తనిఖీ

విశాలాంధ్ర - చాగలమర్రి: మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ బాలుర, బాలికల, సెయింట్‌ఆన్స్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను జిల్లా ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు దొర్నిపాడు ఎంఈఓ మనోహర్‌రెడ్డి,నందికోట్కూరు డిప్యూటి తహసీల్దార్ మధుసుదాకర్‌లు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతి గదికి వెళ్లి విద్యార్థులు పరీక్ష రాస్తున్న తీరును పరిశీలించారు. వారికి కల్పించిన మౌలిక వసతులపై స్థానిక అధికారులను ఆరాతీశారు. మూడు పరీక్షా కేంద్రాలలో 753 మందికి గాను 737మంది విద్యార్థులు హాజరు కాగా, 16 మంది గైర్హాజర య్యారన్నారు. మండల పరిశీలకులు ఎంఈఓ అనురాధ ఉన్నారు.

పశు సంపద కాపాడేందుకు టీకాలు

విశాలాంధ్ర - చాగలమర్రి : పశు సంపదను కాపాడేందుకే గాలి కుంటు నివారణ టీకాలు వేస్తు న్నామని చాగల మర్రి ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు వరప్రసాద్ తెలిపారు. బుధవారం మండలంలోని రాంపల్లె గ్రామంలో జరుగు తున్న గాలికుంటు నివారణ టీకా కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 4 నెలల వయస్సు పైబడిన అన్ని రకాల పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ఉండేందుకు ఈ టీకాలు వేయడం జరుగుతుందన్నారు. చాగలమర్రి, ఉయ్యాలవాడ మండలాల పరధిలో సుమారు 18,150 పశువులు ఉన్నాయని ఇప్పటి వరకు 11,050 పశువులకు ఈ టీకాలు వేసా మన్నారు. పాడి రైతులు గాలికుంటు నివారణ టీకా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి దీపాకుమారి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లి దేవరలో బీసీ ఇందిరా, మాజీ ఎమ్మెల్యే

విశాలాంధ్ర - బనగానపల్లె: మండల పరిధిలోని టంగుటూరు గ్రామ రైతు సంఘం ఆహ్వానం మేరకు టంగుటూరు పెద్దమ్మ తల్లి జాతరకు హాజరైన రోడ్లు భవనాలు పెట్టుబడులు మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరా రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి, పెద్దమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం టిడిపి కార్యకర్తల ఆతిథ్యాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీకాంత్ రెడ్డి, రంగా స్వామి రెడ్డి, ప్రవీణ్ కుమార్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, చల్లా వెంకట సుబ్బారెడ్డి, మద్దిలేటి రెడ్డి, గ్రామ టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమల సంచారానికి బయలుదేరిన పీఠాధిపతి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలం మఠం 46వ పీఠాధిపతి శ్రీ రంగనాథ యతీంద్ర మహదేశికన్ బుధవారం అహోబిలం నుండి తిరుమల సంచారానికి బయలుదేరారు. అహోబిల బ్రహ్మోత్సవాలకు అహోబిలం చేరుకున్న పీఠాధిపతి తెప్పోత్సవాలు ముగియగానే తిరుమల సంచారానికి బయలుదేరారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, అర్చక బృందం ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. స్వామి వారు తమ వెంట తెచ్చుకున్న శ్రీ మాలోల నరసింహ స్వామి బంగారు విగ్రహం తన వెంట తీసుకుని వెళ్లారు.

విద్యార్థికి ప్రథమ స్థానం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : పట్టణంలోని క్రాంతినగర్‌లోని శ్రీ శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు కలాం సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్ లో రాష్ట్రవ్యాప్తంగా ప్రథమ స్థానాల్లో నిలిచారు. 9వ తరగతి విద్యార్థి డి.పవన్ కుమార్ రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంక్, 6వ తరగతి విద్యార్థి ఎన్.కార్తిక్ రాష్ట్ర స్థాయిలో 2వ ర్యాంక్ సాధించారు. విద్యార్థుల ఈ విశేష విజయాన్ని పురస్కరించుకుని పాఠశాల చైర్మన్ సుధాకర్ విద్యార్థులను అభినందిస్తూ, మెమెంటోలు, మెడల్స్, ప్రతి విద్యార్థికి రూ.2 వేల నగదు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థుల ఈ విజయానికి ఐఐటి ఫ్యాకల్టీ అందించిన మార్గదర్శకత ముఖ్య భూమిక పోషించిందని, టీచర్ల కృషికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ ఘనత విద్యార్థులకు మరింత ప్రోత్సాహాన్ని అందించనుందని, భవిష్యత్తులో ఇలాంటి విజయం ఎక్కువ మంది విద్యార్థులు సాధించాలని పాఠశాల యాజమాన్యం ఆశాభావం వ్యక్తం చేసింది.

ఉచిత వైద్య పరీక్ష కేంద్రం

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: స్థానిక సిఈఎస్ ఫార్మసి క్రియేట్ విట్ ఎడ్యుకేషనల్ సొసైటీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వారం రోజులు స్పెషల్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. ఈ క్యాంపు మూడో రోజు చెట్ల మల్లాపురం గ్రామం, ఉచిత వైద్య పరీక్షా కేంద్రం నిర్వహించారు. గ్రామ ప్రజలకు రక్తపోటు పరీక్షలు చక్కర వ్యాధి పరీక్షలు, రక్త గ్రూపుల నిర్ధారణ పరీక్షలను ఉచితంగా విద్యార్థులు. పరిక్షించి. వారికి తగు సూచనలు సలహాలు ఇచ్చి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రామయ్య, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రామ సర్పంచ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మీసేవ సేవలు పునరుద్ధరణ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : మంగళవారం రాష్ట్ర అసెంబ్లీలో మంత్రి నారా లోకేశ్ మీ సేవ వ్యవస్థ ద్వారా ప్రజలకు సర్వీసులు అందజేసే విధంగా మీ సేవ సేవలను పునరుద్ధరించనున్నట్లు ప్రకటించిన సందర్భంగా నంద్యాల మీసేవ ఆపరేటర్లు ఆనందం వ్యక్తం చేస్తూ టిడిపి నంద్యాల అసెంబ్లీ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేశ్, ఎన్ఎండి ఫరూక్‌ల చిత్రపటాలకి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎన్ఎండీ ఫిరోజ్ మాట్లాడుతూ ముందుగా మీసేవ ఆపరేటర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఆపరేటర్లు రామసుబ్బయ్య, జేవీఎస్ కృష్ణమోహన్, మీసేవ బాష, చంద్రశేఖర్, 12వ వార్డు కౌన్సిలర్ కండే శ్యాంసుందర్ లాల్, గోస్పాడు మనోహర్ పాల్గొన్నారు.

నిర్దిష్ట వేళలు పాటించకుంటే చర్యలు తప్పవు

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలలు ఒంటిపూటబడులను నిర్దిష్ట వేళలు పాటించకుండా ఇష్టానుసారంగా నడిపితే చర్యలు తప్పవని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.సామెల్ పాల్ తెలిపారు. ఈ విషయంపై తమ దృష్టికి వస్తే పాఠశాలల మూసివేతకు ఆదేశాలు ఇవ్వడం జరుగుతుందని, ఒంటి పూట బడులకు సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన సమయం ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు.

ఎస్సీ వర్గీకరణకు ఆమోదం పట్ల హర్షం

విశాలాంధ్ర - పెద్దకడబూరు : ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలపడం పట్ల ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు యువరాజ్ మాదిగ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం పెద్దకడబూరులో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ గత 30 ఏళ్ల నుంచి మందకృష్ణ మాదిగ ఎస్సీలో ఉన్న 59 ఉప కులాలను ఏబీసీడీలుగా వర్గీకరణ చేయాలని చేస్తూ ఉన్నారని తెలిపారు. గత సంవత్సరం ఆగస్టు నెలలో ఆయా రాష్ట్రాలు ఎస్సీ వర్గీకరణ చేసుకోవచ్చని సుప్రీంకోర్టు సంచలన తీర్పు ఇచ్చిందన్నారు. ఎస్సీ వర్గీకరణ ద్వారానే 59 ఉప కులాలకు సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. చంద్రబాబుకు మాదిగలు, ఇతర ఎస్సీ ఉప కులాలు రుణపడి ఉంటారని ఆయన వెల్లడించారు.

విద్యార్థినీలకు అవగాహన సదస్సు

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: న్యాయ సేవా అధికార సంస్థ వారు పెద్దపాడులోని గవర్నమెంట్ బాలికల హై స్కూల్‌లో పోక్సో యాక్ట్‌పై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అధితిగా సినియర్ సివిల్ జడ్జి పి. దివాకర్, మాట్లాడుతు అక్కడి పిల్లలకు పోక్సో యాక్ట్‌పై అవగాహన కల్పించారు. లైంగిక నేరాల నుండి రక్షణ చట్టం 2012 ప్రకారం పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు ఉన్నాయని తెలిపారు.